# నీకిది న్యాయమేనా?

## కోయిలా... కూ...ఇలా...

కమ్మని కలలు తప్ప
మరేమీ తెలీని నా కళ్లను
వియోగాల మరీచికల్లాగా మార్చేశావు

ప్రియతమా!
నీకిది న్యాయమేనా?
చేతిలోన చెయ్యేసి మళ్లీ వస్తానన్నావు
నీ రాక అందమైన అబద్ధమని తెలిసినా
నీకోసం ఎదురు చూసి చూసి అలసిన
నా అందాల రెప్పల క్రింద విషాదాల ఉప్పెన
నీపై ప్రేమ ఇంతింతై నింగినంటుతుంటే



నీమీద నమ్మకం మంచుపల్లకిలా కరిగిపోయింది
నీకోసం దిగంతాల కావల నిలిచిన నా చూపులు
నీవు రావని తెలిసి చెమర్చిన నా కళ్లు
రెప్పల మధ్య కన్నీళ్లు
దగాపడినా విరులు భ్రమరాన్నే నమ్మినట్లు
నీ మోహపు మాటల వలలో చిక్కి
విలవిల్లాడుతున్న నన్ను
కాలం కాటేసిన క్షణాన
వెనుతిరిగి చూస్తే ఏముంది?
అంతా శూన్యం!
నిలువెల్లా గాయాలైనా గేయాలు పలికే వేణువులాగా
నా హృదయంలో నువ్వు ముళ్లు గుచ్చినా
నా కళ్లు నీ చివరి చూపుకై ఎదురు చూసేలా చేశావు
ప్రియతమా!
నీకిది న్యాయమేనా?

**- సాధనాల పద్మారమేష్** (విజయవాడ)

# కోరిక

అమ్మ జన్మనిస్తే
నాన్న నడక నేర్పాడు
మీరు జ్ఞానబాట చూపారు
నా మృణ్మయ మనసుకి
ఓ రూపమివ్వడానికి అనవరతం
ఎంత శ్రమించారు!

పదునెక్కిన మేధస్సుతో
అభ్యాసంతో సాధించిన నైపుణ్యంతో
దేశానికి నా వంతు
ప్రతిభనద్దగలుగుతున్నానంటే
అంతర్లీనంగా మిమ్మ
ఆవాహన చేసుకుంటేనే సాధ్యమైంది



చిన్నప్పుడు
చెవి మెలేయకపోయినా
రెండు మమకారపు దెబ్బలేసి
తప్పులు దిద్దకపోయినా
అధోగతిలో వుండేవాణ్ణి

ఎన్ని జన్మలెత్తినా
మీ చల్లని చేత్తో
అక్షరాలు దిద్దించాలి
నా జీవితానికి
వెలుగుబాట ఏర్పరచాలి
అదే నా కోరిక!

**- ప్రతాప వెంకటసుబ్బారాయుడు**
(సికింద్రాబాద్)